క్లుప్తంగా

యువత క్రీడలలో రాణించాలి



మంగళగిరి: యువత విద్యతో పాటు క్రీడలలో రాణించాలని అథ్లెటిక్స్ కోచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద ఫంక్షన్ హాలులో విజేత స్పోర్ట్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అథ్లెటిక్స్ కోచ్ సత్యనారాయణ మాట్లాడుతూ యువతకు క్రీడలలో ఆసక్తిని పెంచేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రెండు స్పోర్ట్స్ మీట్స్, మూడు మెడికల్ క్యాంపులు, విజేత రన్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం అసోసియేషన్ అభివృద్ధికి సహకరిస్తున్న క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ ఖలీల్, ఐ.వెంకటరావు, ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, బాపూజీ, గద్దె శ్రీను, బాజీ ఖాన్, షేక్ ఖాజావలి, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శంగా నిలవాలి



మంగళగిరి: దామర్ల వంశంలోని ధనవంతులు పేదలను ఆదుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పట్టణ బహుత్తమ పద్మశాలీయ సంఘం ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి అన్నారు. ఆదివారం నగర పరిధిలోని పెదవడ్లపూడి తోటలో దామర్ల వంశీయుల వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కుబేరస్వామి మాట్లాడుతూ వనసమారాధనల వలన ప్రజలలో ఐక్యతా భావం పెంపొందుతుందని చెప్పారు. వంశంలోని పూర్వీకులు కాలనీ నిర్మాణాలు, స్కూలు భవనాలు వంటివి నిర్వహించి సమాజంగా ఆదర్శంగా నిలిచారన్నారు. అదే విధంగా వంశంలో పేద, మధ్య తరగతి వారిని గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రముఖులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దామర్ల శంకర్, వీరాస్వామి, నరసింహ, చంద్రశేఖర్, నాగరాజు, కనక లింగేశ్వరరావు, శివనాగేశ్వరరావు, రాజు, రవిశంకర్, మార్కేండేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి విరాళం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు ఆదివారం రూ.1,00,116 అందించారు. తాడేపల్లికి చెందిన మడితాటి శ్రీధర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందించినట్లు కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి తెలిపారు. దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్ట్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న ఓ మహిళను అందిన సమాచారం మేరకు ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో ఓ మహిళ మద్యం అమ్ముతోందని ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ ధనుష్ ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశామని, ఆమె వద్ద 40 క్వార్టర్ బాటిళ్లు లభించాయని, ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ వివరించారు.

ఎమ్మెల్యే ఆర్కే చేయూత

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడి బాపూజీ నగర్‌లో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కట్టెపోగు థామస్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం థామస్ కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు బి.నర్సయ్య, కిషోర్, శివయ్య, భరత్, విజయ్‌బాబు నగదు అందజేశారు.

ప్రతి ఒక్కరికి హిందూ ధర్మం తెలియాలి

ఫిరంగిపురం: హిందూ ధర్మం గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలని శివానందసరస్వతి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం సమరస ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రతాప్‌సింహశాస్త్రి, శ్రీనివాసరెడ్డి, గౌరిశంకర్, రవి, సూర్యనారాయణ, సుంకరవెంకటేశ్వర్లు, అశ్వని పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, పార్టీ సమన్వయకర్త సురేష్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు బత్తుల

ఫిరంగిపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం–1,2, రైతు భరోసా కేంద్రం– 2 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, ప్రభుత్వం సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో సేవలు అందేలా సచివాలయం, రైతుభరోసాకేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అర్హులైతే చాలు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారికి అందేలా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా బాగుండాలనే ఉద్దేశంతో చేతి వృత్తుల వారికి జగనన్న చేయూత అందిస్తూ వారి వారి వృత్తులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే రెండుకళ్లుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గాంధీ నడిచిన బాటలో నడుస్తూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నారని చెప్పారు. ఏ రాష్ట్రంలో ఇప్పటి వరకు లేని విధంగా అభివృద్ధి మన రాష్ట్రంలో జరిగిందని తెలిపారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతి పక్షనాయకులు చెబుతున్న మాయ మాటలు ప్రజలు నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, ప్రభుత్వం సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్‌ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, మేడాబాబు, వై.యల్లారెడ్డి, ఇ.మస్తాన్‌రెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, పాలపాటి రఘు, చిట్టా బాపూజీరెడ్డి, పి.చిన్న, డి.సురేష్, రంజన్ బాబు, వి.రాము, డేవిడ్, బి.అంజిరెడ్డి, లక్ష్మయ్య, పాపిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నృసింహస్వామి ఆలయానికి ఆదాయమే లక్ష్యం



రాజీవ్ గృహకల్ప రోడ్డులో పూర్తయిన షాపింగ్ కాంప్లెక్స్



దేవస్థానం ఎదుట మైదానంలో పూర్తయిన కల్యాణ మండపం

మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామికి ఉన్న ఆస్తులను పరిరక్షించడంతో పాటు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనులు చేపట్టారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో గత ఎన్నో సంవత్సరాలుగా వృథాగా పడి ఉన్న దేవస్థాన ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకువచ్చి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాజీవ్ గృహకల్ప రోడ్డులో ఉన్న 3.32 ఎకరాలలో రూ.60 లక్షలతో రోడ్డు ఆనుకుని పది దుకాణాలు నిర్మించి ఈ నెల 5వ తేదీన ప్రారంభించనున్నారు. ఆలయం ఎదుట ఉన్న మైదానంలో దాత దేవతి భగవన్నారాయణ రూ.80 లక్షలతో కల్యాణ మండపం నిర్మించగా ఈనెల 5వ తేదీన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించనున్నారు. ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి మాట్లాడుతూ ఆలయ ఆస్తులు పరిరక్షించడంతో పాటు పేదలకు ఉపయోగపడేలా ఆలయానికి ఖాళీ స్థలాలలో కల్యాణ మండపాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రజకులకు సముచిత స్థానం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



మాట్లాడుతున్న సురేష్ కుమార్

తాడికొండ: రజకులకు సముచిత స్థానం కల్పించి, కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా వారికి హక్కులు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీదే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. రజక సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రజకులకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆ సామాజిక వర్గానికి మేలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్నారన్నారు. తమ సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకొస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ కుమార్‌ను రజక సేవా సంఘం అధ్యక్షుడు కలుగూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు ఈదర రవి సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా రజక సంఘం రాష్ట్ర నాయకులు పాతపాటి అంజిబాబు పాల్గొని రజకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో రజక సంఘం సెక్రటరీ చట్టు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ బాసాటి రఘు కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మినేని పున్నారావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక క్యాంపులు విజయవంతం



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మీకుమారి తదితరులు



తాడేపల్లిలో యువకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రం వద్ద ఫొటో సెషన్

డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి

మంగళగిరి: ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులలో భాగంగా నగరంలో శని, ఆదివారాలలో పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపులు విజయవంతం అయినట్లు డెప్యూటీ కలెక్టర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఏ లక్ష్మీకుమారి తెలిపారు. ఆదివారం నగరంలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక క్యాంపులలో నూతన ఓటర్ల నమోదు కొరకు ఫారం 6, 222 దరఖాస్తులు, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల కొరకు ఫారం 7లు 58 దరఖాస్తులు, సవరణల కొరకు ఫారం 08, 590 దరఖాస్తులు ఓటర్లు చేసుకున్నట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, నూతన ఓటర్లను చేర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్ కె.హేమమాలిని, డెప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్ బిక్కిరెడ్డి శివారెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదుపై విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలో తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం స్పెషల్ సమ్మర్ ఓటర్ క్యాంప్‌ను నిర్వహించారు. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పారిశుద్ధ్య ఆటోలకు మైకులు ఏర్పాటు చేసి న్నికల కమిషన్ విడుదల చేసిన ముసాయిదాతో పాటు, కొత్త ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రతి బూత్‌లో నిర్వహిస్తున్నామని ప్రచారం నిర్వహించారు. తాడేపల్లిలోని 48 బూత్‌లలోను, రూరల్ పరిధిలోని 41 బూత్‌లలోను బీఎల్ఓలు అందుబాటులో ఉండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, తహసీల్దార్ నాగిరెడ్డి బూత్‌లను పరిశీలించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నవారిని అభినందించి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రచార బోర్డుల వద్ద ఫొటోలు తీయించి వాటిని మేము ఓటు హక్కు నమోదు చేయించుకున్నాం.. మీరు కూడా నమోదు చేయించుకున్నారా? లేదా అంటూ వాట్సప్ చేసి వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్ సూచనల మేరకు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశామని, నేను ఓటు హక్కు నమోదు చేయించుకున్నా మీరు కూడా నమోదు చేయించుకున్నారా అనే అంశంతో బోర్డులు ఏర్పాటు చేసి ఓటు నమోదు చేసుకున్న వారిని అక్కడ నిలబెట్టి ఫొటో తీసి ప్రచారం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్ఐలు ప్రశాంతి, వంశీ, ఆర్వో మురళి పాల్గొన్నారు.

భక్తులతో కళకళలాడిన కాకాని శివాలయం



పెదకాకాని: కార్తిక దీపాల కాంతులతో పెదకాకాని శివాలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మూడో ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ప్రాకార మండపాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయం చుట్టుపక్కల ఎటు చూసినా దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులే కనిపించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తిక దీపాలు వెలిగించి, పూజలు చేసుకునే విధంగా టేబుళ్లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జామునే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. యజ్ఞాల బావి నీటితో పవిత్ర స్నానాలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. పొంగలి నైవేద్యాలతో, ప్రభలతో ఆలయం చుట్టూ హరోం హర అంటూ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో దాతలు ఉచితంగా వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆలయంలో అధికంగా అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, తలనీలాలు సమర్పణ, అన్నప్రాశనలు, నామకరణలు, వాహనపూజలు అధిక సంఖ్యలో జరిగాయి. ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ. 7 లక్షల ఆదాయం, అన్నదానానికి రూ. 10.50 లక్షలు విరాళాలు సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



మాట్లాడుతున్న కృష్ణయ్య

తాడేపల్లిరూరల్: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న బీజేపీ విధానాలను వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రైతాంగ సమస్యలపై విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే విధంగా చర్యలు చేపట్టారని అన్నారు.

రైతు సంఘం గుంటూరు జిల్లా నాయకుడు పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలను అమలు చేస్తోందని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను రైతులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వేలాదిమంది పాల రైతులు పాడిపై ఆధారపడి ఉన్నారని అన్నారు. జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్థానిక రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 11వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వల్లూరి భారతి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, ఎస్కే ఎర్రపీరు, ములకా శివసాంబిరెడ్డి, వీరాస్వామి, సదాశివరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి గురువులే కారణం

రవాణా శాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి



పూర్వ గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఉన్నతికి గురువులే కారణమని రవాణాశాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బీహెచ్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థినుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల్ని సన్మార్గంలో నడిపించడంలో గురువులు తమ బోధన పటిమ, వ్యక్తిత్వంతో కృషి చేస్తారని తెలిపారు. బీహెచ్ హైస్కూల్ పూర్వ విద్యార్థినిగా తాను ఉన్నతస్థాయికి ఎదగడం వెనుక గురువులు పంచిన విజ్ఞానం, అలవర్చిన క్రమశిక్షణ కారణమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బెంగుళూరు కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రామరాజు అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం యువతరం ప్రతి చిన్న విషయానికీ ప్రతికూల దృక్పథాన్ని ఏర్పరచుకుంటున్నారని, జీవితంలో అన్నీ అనుకున్నట్లుగా ఎవ్వరికీ జరగవని చెప్పారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు జీవితాన్ని ధైర్యంగా మలచుకోవాలనేది నేర్చుకోవాలని చెప్పారు. నాటితరం విద్యార్థులు ప్రకృతిని, తోటివారిని పరిశీలించి విషయ పరిజ్ఞానంతో నాయకత్వ లక్షణాలు అలవర్చుకునే వారని వివరించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగం ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.ఐదు లక్షల విరాళాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థిని వాణీ సుజాత మాట్లాడుతూ తమ సంఘ ఆధ్వర్యంలో పాఠశాలలో గ్రంథాలయాన్ని పునర్నిర్మించడంతో పాటు సోలార్ ప్యానెల్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన పూర్వ ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ముందుగా బండ్లమూడి హనుమాయమ్మ విగ్రహానికి వ్యవస్థాపకురాల్లో ఒకరైన ఏక ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు కర్పూరపు శాంతిభూషణ్, కరస్పాండెంట్ దేశిరాజు సాయినాథ్, పూర్వ విద్యార్థినుల సంఘ చైర్‌పర్సన్ జయశ్రీ, కన్వీనర్ సంధ్యశ్రీ, అధ్యక్షురాలు డాక్టర్ రాజరాజేశ్వరి, కోశాధికారి శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె. లలిత, సభ్యులు సుమిత్ర, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

- ప్రారంభించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- ములుకుదురులో అనూహ్య స్పందన
- కంటి పరీక్షలకు భారీగా తరలివచ్చిన రెండు గ్రామాల ప్రజలు



శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): పొన్నూరు మండలం ములుకుదురు, మాచవరం గ్రామాల్లో ఆదివారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని స్థానిక గ్రామ పెద్దలతో కలసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కలల్ని తన ఆశయాలుగా స్వీకరించి, రాష్ట్ర చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతకు నిదర్శనమని తెలిపారు. ఆయన సేవల్ని స్ఫూర్తిగా తీసుకుని ఏడాది పొడవునా సంక్షేమ కార్యక్రమాల పరంపర కొనసాగిస్తూ, ఈ ఏడాదిని బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంగా ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గత 11 నెలల్లో వేలాది మందికి కంటి వైద్య పరీక్షలు చేయించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశామని పేర్కొన్నారు. పరీక్షలు జరిపిన ఏడు రోజుల్లో అక్కడే కళ్లజోళ్లు పంపిణీ చేయడం నేత్రజ్యోతి ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించడానికి ముందుగానే ములుకుదురు, మాచవరం గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో బజరంగ్ సేవా విభాగం బృందం పర్యటించి, ఇంటింటికీ ప్రచారం చేసినట్లు చెప్పారు. శిబిరానికి వచ్చిన 1034 మందికి దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించినట్లు వివరించారు. గుంటూరుకు చెందిన ట్రికాన్ క్లినిక్ సహకారంతో 135 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించామని తెలిపారు. ప్రధానంగా తమ వైద్య శిబిరానికి ములుకుదురులో అనూహ్య స్పందన లభించడం అభినందనీయమని తెలిపారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఈ శిబిరానికి రాకపోకల కోసం ప్రత్యేక వాహనాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

యూటీఎఫ్ నేత దత్తుకు ఘన నివాళి



గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ సీనియర్ నాయకుడు ఎంఏకే దత్తు మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎంఏకే దత్తు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో శనివారం తుదిశ్వాస విడిచిన దత్తు భౌతిక కాయాన్ని ఆయన కోరిక మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలకు కుటుంబసభ్యులు అప్పగించారని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

గుంటూరు రూరల్: బాలిక ఆత్మహత్యపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరిపాలెం ప్లాట్లకు చెందిన మల్లెల అక్షయ(14) ఓబులు నాయుడుపాలెం పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. నవీన్ వేధిస్తున్నాడని మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

17న రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కల్యాణ్ మాట్లాడుతూ సబ్ జూనియర్స్, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో వెస్ట్రన్, క్లాసికల్, ఫోక్ డాన్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 17న ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 9వ తేదీలోపు పేర్లను 8897508897 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శి పి. అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వై. దుర్గారామ్, ఉపాధ్యక్షులు జె. చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగుల గొట్టిన ముగ్గురిపై కేసు

గుంటూరు ఈస్ట్: ముగ్గురు వ్యక్తులు కారు అద్దాలు పగుల గొట్టిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీపురం 3వ లైనులో ఉడుముల వెంకటేశ్వరరెడ్డికి ఎడ్యుకేషనల్ కన్సల్‌టెన్సీ ఉంది. శనివారం రాత్రి ఆయన కారు పార్కింగ్ చేసే విషయంలో ముగ్గురు వ్యక్తులతో ఘర్షణ జరిగింది. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయి మళ్లీ వచ్చి వెంకటేశ్వరరెడ్డి కారు అద్దాలు పగుల గొట్టారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 మంది జూదరుల అరెస్టు

వేర్వేరు చోట్ల పేకాడుతున్న 19 మందిని పోలీసులు అరెస్టు చేశారు. చంద్రమౌళీనగర్ 7వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నరన్న సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు ఆదివారం దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. రూ. 1,10,300తో పాటు 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- ఏసుభక్త నగర్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న నగరంపాలెం పోలీసులు ఆదివారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, రూ. 54,370తో పాటు తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషిచేయాలి



సమావేశంలో ఆపస్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సంఘ కోర్ కమిటీ సమావేశంలో ప్రతినిధి వై. శ్రీహరి పూర్ణప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. పద్మ మాట్లాడుతూ ఈనెల 17న జరగనున్న నారీశక్తి సమ్మేళనాన్ని మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.బాల చంద్రారెడ్డి, కె. శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి. వీరబ్రహ్మం, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.